కథ 1993

1

జాడ

తుమ్మేటి రఘోత్తమరెడ్డి

"వాన్ని ఇక ఈ జన్మకు చూడగలుగుతానో లేదో?" అది ఆవేదనో, ఆందోళనో తెలియకుండా తనలో తాను గొణుక్కుంటూ సుజాత రైలు దిగింది. తుఫాను గాలిలో మొదలంటా కదిలిపోయే చెట్టులా వణుకుతూ ఈ మాట ఆ రోజు ఉదయం నుండి లెక్కలేనన్నిసార్లు అనుకుంది.

ఒక్కొక్క చినుకే కురిసి కురిసి పాయలు పాయలుగా బయలుదేరి నీరు సముద్రం చేరి నట్లుగా సుజాత ఆలోచనలు సాగిసాగి 'వాడి' దగ్గరే లుంగలు చుట్టుకపోతున్నాయి. వాడు అంటే సుజాత తోబుట్టువు.

ఆ చిన్న రైల్వే స్టేషన్లో కలో, భ్రాంతో తెలియనంత సందిగ్ధంలో సుజాత రైలుదిగే సమయానికి సాయంత్రం వెలుగు చీకట్ల సందిగ్ధంలో ఉండి క్రమంగా చీకటి ముసురుకుంటోంది. సుజాతలాగే దిగిన ప్రయాణీకులు చాలా తక్కువమంది. ఎక్కింది కూడా చాలా తక్కువమందే. ఎత్తు తక్కువగా ఉన్న ప్లాట్‌ఫాం మీదికి దిగుతుంటే సుజాత కాళ్లు వణికాయి. తూలి పడిపోగల దేమోననుకొని కాబోలు వెనక నుండి, "పదిలం-పదిలమక్కా," అంటూ ఎవరో దించారు.

సుజాతలాగే ఆకాశం ఉరుములతో, మెరుపులతో తల్లడ మల్లడంగా ఉంది. చినుకు రాలదు. ఘర్షణ ఆగదు. ఉధృతంగా వీస్తున్న గాలికి స్టేషన్‌లోని పాత కాలపు రాలచెట్లు మొదలంటా ఊగిపోతున్నాయి. గాలి రేపిన దుమ్ముకు స్టేషన్ మావురు గప్పినట్టుగా ఉన్నది. స్టేషన్‌మాస్టర్ గదిని స్టేషన్‌ను తీవ్రవాదుల నుండి రక్షించడం కోసం నియమించబడిన పోలీసులు ఆక్రమించుకున్నారు. పోలీసుల్లో ఒకడు ఇసుక బస్తాల మాటున నిలబడి తుపాకితో సెంట్రీ చేస్తున్నాడు.

సుజాతకు ఆ గాలి, అక్కడి వాతావరణం ధ్యాస ఉన్నట్టే లేదు. నెత్తి మీదికంటా కొంగు లాక్కొని ప్లాటుఫాం దాటుకొని స్టేషన్ వెనుకకు వచ్చింది. గాలిలో ప్రయాణీకుల సందడేం విన్పించడంలేదు.

స్టేషన్ వెనుక అడ్డదిడ్డంగా పెరిగిన ముసలి తుమ్మచెట్లు- నిశ్శబ్దంగా ఉన్న నాలుగైదు రైల్వే క్వార్టర్లు- సరిగ్గా స్టేషన్ వెనుక నుండి ముసలి తుమ్మలను చీల్చుకొని మట్టిరోడ్డు తూర్పుదిశకు సాగు తోంది. స్టేషన్‌కు కొద్ది దూరంలో ఒక ముసలి తుమ్మ కింద హోటల్ గుడిశెలో గుడ్డి లాంతరు గాలికి రెపరెపలాడు తోంది. ఒకరిద్దరు ప్రయాణీకులు నడువవల్సిన దూరానికి మజిలీగా హోటల్ ముందు నిల్చున్నారు. ఎప్పుడో యాభయ్యేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకొని ఊరు విడిచి వచ్చి స్థిరపడి ఇరువై ఏండ్ల క్రితం భర్త మరణించగా ఒంటరిగా ఆ స్టేషన్నే నమ్ముకొని బతుకుతున్న రాధమ్మ రైలు దిగిన ప్రయాణీకుల గిరాకీ కోసం ఎదురు చూస్తోంది.

సుజాత ఇవేమీ పట్టించుకోకుండా మట్టి రోడ్డు మీద నడుస్తోంది. ఆమె మెదడు నిండా తమ్ముడే నిండి పోయాడు. ఆమె తనువెల్లా తమ్ముడే తచ్చాడుతున్నాడు. ఆమె కడుపులో దుఃఖం సుళ్లు తిరుగుతోంది. ఆ దుఃఖానికి ఎంత వెతికినా ఆది అంతం కన్పించడం లేదు. బొయ్యిమని గాలి రేగుతోంది. పైన ఆకాశం ఉండీ ఉండీ ఉరుముతోంది. మెరిసిన మెరుపులో బిజిగిరి గ్రామం దానిపక్కలా సకల దుఃఖాలను దాచుకున్న పంట భూములు నిశ్శబ్దంగా పడి ఉన్నాయి. సుజాత తలెత్తి చీకటి నిండిన ఆకాశంలోకి చూసింది. కుడివైపున గుట్టమీది మైక్రోవేవ్ స్టేషన్లో పచ్చలైటు రాత్రిపూట పులి కన్నులాగా పచ్చగా మెరుస్తోంది.

'ఇప్పుడు వాడెక్కడున్నాడో?' రెపరెపలాడే గాలిలో ముందుకు నడుస్తూ అనుకున్నది. నిర్మానుష్యమైన మట్టిరోడ్డు మీద శబ్దం చేస్తూ ఒక పెద్ద బండి రావడం కన్పించింది. "ఎవరవ్వా! సీకటి బడ్డది. ఎంటెవలు లేకుంటనే పోతన్నవ్. రైలచ్చిందా?" ఒక గొంతు సుజాతను పరామర్శించింది. సుజాత మరేదో లోకంలో ఉన్నట్టు ఆగకుండా ముందుకు సాగింది. బండి చప్పుడు, గొణుగుడు గాలి శబ్దంలో కలిసి పోయాయి.

'ఎన్ని హింసలు పెడుతున్నారో వాన్ని,' సుజాత పెదవులు వనుకుతున్నాయి. వద్దు వద్దనుకుంటూనే ఇలాంటి ఆలోచనలు. 'ఈ రాత్రి ఎక్కడని తిరిగేది? వాని జాడ ఎట్లా తెలుసుకునేది?' సుజాత ఒక నిముషం నిలబడిపోయింది. అనేక ప్రశ్నలు వచ్చాయి కాని ఇంత దాక ఈ ప్రశ్న రాలేదు సుజాతకు. ఒక మహోధృతమైన ఆవేశంతో ఇంటి నుంచి బయలుదేరి స్టేషన్లో దిగేదాక ఇలాంటి ప్రశ్నే వేసుకోలేదు సుజాత. ఎందుచేతనో సుజాత మనసు ఆ ప్రశ్న మీద నిలువలేదు. తనకు తెలియకుండానే తిరిగి నడవ సాగింది.

ఉధృతంగా వీస్తున్న గాలి ఆమెను రోడ్డు ఒక పక్కకు ఈడుస్తోంది. ఆమె కట్టుకున్న లేతాకు పచ్చ రంగు కాటన్ చీర గాలికి రెపరెప కొట్టుకుంటోంది. పద్దెనిమిదేండ్ల వైవాహిక జీవితంలో వేళకు తిండి తినక, నిద్రపోకా తప్పని ఇంటిచాకిరిలో ఆమె దేహం చీకిపోయింది. చౌటినేలలాంటి కుటుంబ జీవితంలో సన్నబడి తెల్లగా పాలిపోయింది. ఇదమిద్ధంగా సుజాతకు తెలియని ఒక బలీయమైన విశ్వాస మేదో ఆమెను బతికిస్తోంది కాని సుజాత శరీరస్థితిని బట్టి ఆమె బతకాల్సింది కాదు. ఇప్పుడు కూడా ఈ చీకటి నిండిన వర్షాకాలపు రాత్రి కూడా సమస్త సంసారిక బంధనాల కట్టుదిట్టాలను త్రెంచుకొని పరుగెత్తుకుని వచ్చేలా చేసింది ఆ విశ్వాసమే.

భర్త ఉద్యోగరీత్యా సుజాత బొగ్గుగనుల కాలరీలో ఉంటోంది. నిన్నటిరోజు ఉదయాన్నే పత్రికల్లో ఆమె తమ్ముని అరెస్టు వార్త అచ్చుయ్యింది. ఆ వార్తను సుజాత ఆలశ్యంగా చూసింది. సుజాత భర్త మధుసూదన్ బలవంతంగా దినపత్రికను బందు చేయించాడు. పిల్లల చదువు పాడవుతున్నదని అతను చెప్పిన కారణం. అయితే అతని మనసులో ఉన్న కారణం తనకి తెలుసు. నక్సలైట్లను జైళ్ల నుండి వదిలివేసిన కాలం. అప్పుడు సుజాత తమ్ముడు కూడా అనేకమందితో పాటు వరంగల్ జైలు నుండి విడుదలయ్యాడు. ఆ విడుదల వార్త పత్రికలల్లో రెండు రోజుల ముందే వచ్చినా సుజాత చూడలేకపోయింది. ఆ కారణంగానే జైలు దాకా వెళ్లి సుజాత తమ్మున్ని చూడలేకపోయింది. అక్కడి నుండే అతనెవరితోనో తన మంచి చెడ్డలు విచారించి అటునుండటే అజ్ఞాతంలోకి పోయాడు.

అప్పటి నుండి సుజాత భర్తను ధిక్కరించి పత్రిక ఇంటికి తెప్పిస్తున్నది. భర్త ఊహించిన దానికి సరిగ్గా వ్యతిరేకంగా సుజాత పత్రిక ద్వారా లోకంతో సంబంధం కలుపుకోవడానికి ప్రయత్నం చేసింది. తను పుట్టిన ఊరైన బిజిగిరి పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న సంఘటనల వార్తాపత్రిక కోసం ఎదురుచూసేది. ఇది చెప్పక పోయినా తన భర్తకు తెలుస్తూనే ఉన్నది. నెల రోజుల క్రితం జరిగిన తీవ్ర వాగ్యుద్ధం తర్వాత ఆ ఇంటికి పేపరు రావడం ఆగిపోయింది. ఎప్పటిలాగే తీవ్రమైన నిరసనతో సుజాత మిన్నకుండిపోయింది. కాని సుజాత అంతరంగం వార్తల కోసం వెతుకుతూనే ఉండేది.... పక్క ఇంటి నుండి పేపరు తెప్పించుకొని చదివేది.

ఆరోజు భర్త డ్యూటీకి, పిల్లలు స్కూలుకు వెళ్లిన తరువాత పక్కింటి పేపరు చూస్తే పిడుగులాంటి వార్త. 'తన తమ్మున్ని పోలీసులు అరెస్టు చేశార'ని వాడి సంబంధీకులెవరో ప్రకటన చేశారు. '...అలాంటిది మేమెరుగం,' అంటూ పోలీసులు ప్రకటించారు.

సుజాత మెదడు మొద్దుబారిపోయింది. సకల చేష్టలుడిగిపోయి ఆ ఉదయం మధ్యాహ్నం చెప్పుకోవడానికి మనిషి లేక తల్లడిల్లిపోయింది. తన సమస్త కలల ప్రపంచం చెదిరిపోయినట్లుగా మంచంలో పడి వెక్కి వెక్కి ఏడ్చింది. తమ్ముడు తన ప్రతిచర్యను గమనిస్తున్నట్లే- ఆ చర్య మంచి చెడ్డల విచక్షణ చేస్తున్నట్లే తను ఊహించుకొని ఇంతకాలం బతుకుతూ ఉంది. జీవితంలో తనకున్న తల్లిపేగు సంబంధాన్నెవరో ఒక్కసారిగా త్రెంచివేసినట్టుగా కుప్పకూలిపోయింది.

ఆమె మరిచిపోయిన ఆమె జీవితమంతా క్రమంగా స్ఫురణకు తెచ్చుకున్నది. అంతకంతకూ జీవితేచ్ఛకు దూరమైపోతున్న సారహీనమైన సంసార జీవితం కండ్ల ముందు కదలాడింది. పెండ్లయి వచ్చిన కొత్తలో తను తెలుసుకోలేకపోయిందిగాని అతను- మధుసూదన్ మొదటి నుండి డబ్బు మనిషే- పెండ్లిపల్లకి బోయిల ఓంకార నాదంతో- అర్ధరాత్రి విషాదకరమైన వీడ్కోలుతో తాను పుట్టి పెరిగిన బిజిగిరి నుండి భర్తతో పాటు కాలరీ మీదికి కాపురానికి రావడం- సంవత్సరం గడిచేలోగా మొదటి కూతురు, తరువాత మరో కూతురు- భర్తకున్న కొడుకు కాంక్షతో మరో సంతానం. ఆమె కూడా కూతురే కావడం తుదకెట్లాగో ఘర్షణ పడి ఆపరేషన్ చేయించుకోవడం- సంసారమన్నాకా సవాలక్ష గొడవలనుకుంటూ సర్దుకుపోవడానికి తన సవాలక్ష ప్రయత్నాలు- తిరిగి తిరిగి మళ్లీ మొదటికొచ్చే సమస్యలు- యవ్వనం, పురిటివాసనల మధ్య ఎడతెగని గొడవల మధ్య గడిచి

పోయింది. అంతకంతకూ గొడవలు, అసంతృప్తులు ముదిరిపోయి ఇద్దరి మధ్య దూరం పెరగసాగింది. తను నిరాశపడుతూ కూడా- ఈ నరక సదృశమైన కనిపించని యుద్ధాల మధ్య పిల్లల లేత ముఖాలు- పిల్లలు దిక్కు లేని వారైపోతారని తను తన జీవితానికి ముగింపు పాడలేదు.

పదే పదే వెంటాడే ప్రశ్నలు సుజాతను పీల్చి పిప్పి చేశాయి. ఈ మొత్తం కుప్పకూలిన జీవితంలో తానెక్కడ తట్టుకొనిపోయిందో? ఆ రోజు మంచంలో దుఃఖంతో సుజాత కొట్టి పోసుకున్నది.

మళ్లీ ఆలోచనలు తమ్ముని మీదికి పోయాయి. హఠాత్తుగా ఆకాశం గుడగుడలాడింది. తళుక్కున మెరిసే మెరుపుల సమారోహాలు. సుజాత రోడ్డుమీద నిలబడి చుట్టూ చూసింది. ఇది కలా నిజమా? తనెక్క డున్నది? ఎటు పోతున్నది? తన చుట్టూ చీకటి ఎందుకు కమ్ముకున్నది? ఆకాశం ఎందుకు గుడగుడలాడు తోంది? తెగిపోతూ అతుక్కుంటూ మళ్లీ తెగిపోయే ఆలోచనల పరంపరలో నుండి మళ్లీ తమ్ముడు... తమ్ముడి జ్ఞాపకాలు నిలువెల్లా వ్యాపించగా సుజాత ఆ మట్టిరోడ్డు మీద నడవసాగింది.

వాడు తన తమ్ముడేనా? వాన్ని కని తల్లి చనిపో యింది. అలాంటి సమయంలో తన లేత రెక్కల ఆలన లో, పాలనలో తొలిసంతానంగా పెరిగాడు వాడు. ఇంటి నిర్వహణతోపాటు తమ్ముని పెంపకం తనమీద పడింది.

వాడు ప్రైమరీ స్కూలుకు వెళ్లే వయసులోనే తనకు వివాహమయ్యి కాలరీ మీదికి తరలి వచ్చింది. తల్లిలేని తమ్ముణ్ని- తనతో తెచ్చుకోవడం కోసం మధు సూదన్‌ను అడిగింది. ఎందుచేతనోగాని మధుసూదన్ అంగీకరించాడు. 'ఎంత ప్రయత్నం చేసినా తమ్ముడు చదువులో అంతగా రాణించలేదు. వాడికి ఆ చదువు రుచించినట్టు లేదు. ఎప్పుడూ దిగులుగా, ఒంటరిగా కన్పించేవాడు. వాడి చిన్నారి మెదళ్లో ఏయే తుఫాను గాలులు రేగుతున్నాయో తనకు అర్థమయ్యేది కాదు. క్రమంగా క్లాసు పుస్తకాల కంటే మరేవో పుస్తకాలు దొంగ చాటుగా తెచ్చుకొని చదివేవాడు. పోనీలే ఏవో పుస్తకాలు, ఏదో చదువు చదువుతున్నాడు గదా అని తనకు తాను జవాబు చెప్పుకునేది. కాని మధుసూదన్ చిరచిర లాడుతూ ఉండేవాడు. వాళ్లిద్దరి మధ్య ఏదో అఖాతం పెరగడం ఆరంభమౌతున్నట్లు తనకు తెలుస్తూనే వుంది. మధుసూదన్ ఇంట్లో వుంటే వాడు బయటెక్కడో తిరిగి వచ్చేవాడు... మధుసూదన్‌కు ఇది కంటగింపుగా వుండేది. ఓరోజు వాడి కోసం కాచుక్కూర్చున్నాడు. రాత్రి పదిగంటలకు వాడొచ్చాడు. చేతిలో ఏదో పుస్తకం. వాడట్లా నిలబడే ఉన్నాడు. "ఆ చదువులేం కూడు బెట్టయి. ఒక్కొక్కడికి చదువుకునే స్తోమత లేక అంగ లారుస్తున్నారు... మేం ఎంత ఇబ్బంది పడుతున్నామో నీకు అర్థమయ్యే ఉంటుంది. నువ్వు మంచి చదువులు చదువుకో- ఎంత డబ్బైనా నేను పెడతాను," మధు సూదన్ కంఠంలో అధికార స్వరం. వాడు ఔననలేదు. కాదనలేదు. తను ఏం ముంచుకు రాగలదోనని హైరానా పడుతున్నది. వాడి ముఖంలో నాన్న- అనేక కష్ట, నష్టాలతో ఏమాత్రము తొట్రుపడకుండా నిలబడిన నాన్న- అమ్మ చనిపోయాక, బంధువులు చుట్టాలు మళ్లీ పెళ్లి చేసుకొమ్మన్నప్పుడు ఇట్లాగే నిర్వికారంగా నిలబడి పోయిన సంగతి జ్ఞాపకం వచ్చింది. నాన్న సాత్విక సంస్కారానికి తోడు వీడికి పరిశీలనాశక్తి అబ్బింది. తమ్ముని గురించి తనకు అర్థమయ్యింది అప్పుడే-

వాడు ఇంటర్మీడియట్ తప్పాడు. సుజాత తమ్మునికి అంత మంచి చదువు చెప్పించలేకపోయా మని లోలోపల బాధపడ్డది. మధుసూదన్ ఎప్పుడో అతని పట్ల ఆశలు చాలించుకున్నాడు. మధుసూదన్ ఆలోచనలు విరిగిపోయాయి. వాడు ఏ డాక్టర్రో, ఇంజ నీరో అయితే తన కూతురునిద్దామనే ఆలోచనలు చేసి నట్టు తనకు అర్థమయ్యింది.

సరిగ్గా ఆ రోజుల్లోనే సుజాత తండ్రి గ్రామంలో చనిపోయాడు. తండ్రి వారసత్వంగా మిగిలిన కుప్ప కూలిపోతున్న వ్యవసాయం ఇంటర్లో తప్పిన తమ్ముని మీద పడ్డది. తమ్ముడు వెళ్లకముందే వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగిపోయాయి. గిట్టుబాటు ధరలు లేక రైతులు విలవిలలాడ్డం- బ్యాంకుల చుట్టూ తిరగడం- అప్పుల ఉచ్చులు. భూములను తెగనమ్ముకోవడం, ఇవన్నీ సుజాత తండ్రితో ఉన్నప్పుడే చూసింది. తమ్ముడు ఆ రొంపిలోకి దిగకూడదనుకొని ఎంత ప్రయత్నం చేసినా వాడు అందులోకే పోక తప్పలేదు. తమ్మునికి తోడుగా ఇంటి దగ్గర ఎన్నడో భర్త చనిపోయి పుట్టింటికి చేరిన మేనత్త వుండేది. తమ్ముడు వ్యవ సాయం చేసిన మూడు నాలుగేండ్లు సుజాత వాడు కుప్పకూలిపోకూడదని ఎంతో తండ్లాడి పోయేది.

"వాడక్కడ నిప్పుల మీద మొక్కజొన్న కంకితీరుగ బొర్లిపోతున్నాడు. వాడికి అయిదో పదో అప్పుగానే ఇవ్వండి వాడు బతకలేడు," సుజాత భర్తతో.

"ఈ బుద్ధి నీకు గాదు వాడికుండాలె- మేమంతా బుద్ధిలేని వాళ్లమై ఇక్కడికి వచ్చినమా? చెప్పంగ వినని వాడు చెడితేనే తెలుస్తది," మధుసూదన్ అకారణంగా కోపం తెచ్చుకున్నాడు. "వ్యవసాయం, పాత బొంద, అది ఒడ్డున పడేదా! గడ్డన పడేదా? మీ తమ్ముడికి అంతకన్నా గొప్ప పనేం తోచదు... అయినా పెద్దల మాటమీద గౌరవం లేని మనిషికి మన మాటలేం రుచిస్తాయి. అయినా నా దగ్గర ఎక్కడున్నయి పైసలు."

సుజాతకు అంతా అర్థమౌతూనే ఉన్నది. వాళ్లిద్దరు చెరోపక్క నిలబడ్డారని- వాళ్లిద్దరికీ యుద్ధము తప్ప సఖ్యత కుదరదని సుజాతకు అర్థమవుతూనే ఉన్నది. భర్త ఎక్కడ నిలబడ్డాడో తెలిసినంత స్పష్టంగా తమ్ముడి స్థానం తెలిసేది కాదు. అదే రోజుల తరబడి సుజాతను వ్యాకులపరిచేది.

తను దాచుకున్న పదీపరకా తమ్ముడు వచ్చినప్పు డల్లా చేతిలో పెట్టేది. వాడు అవి తీసుకుంటున్నా వాడి కళ్లల్లో విలవిలలాడటం కన్పించేది. అప్పటికి ఊళ్లల్లో రకరకాల గొడవలు. సరికొత్త రాజకీయాలు వచ్చి చేరు తున్నాయి. ఊళ్లు తల్లడిల్లిపోతున్నాయి. ఒక పెను తుఫాను ప్రతి మనిషిని మొదలంటూ కదిలించినట్టయి పోయింది. తరువాత మేనత్త చనిపోవడమో మరెందుకో గాని తమ్ముడు ఊరు విడిచి వచ్చాడు. సింగరేణిలో పరుగు పందేలతో ఉద్యోగాలు ఇచ్చే కాలంలో అందు లో గెలిచి బదిలీ ఫిల్లరు ఉద్యోగం చేరాడు.

మధుసూదన్‌కు వాడి పొడ గిట్టకుంటయ్యింది. డాక్టరుగానో, ఇంజనీరుగానో చూడాలనుకున్న బావ మరిది బదిలీ ఫిల్లర్ ఉద్యోగం చేయడం నామోషీగా ఉన్నది. ఒక సంవత్సరం కాగానే ఇంకో రాగం ఎత్తు కున్నాడు. లంచాలిచ్చో, పైరవీలు చేసో పైమెట్టుకు పొమ్మని చెప్పేవాడు. వాడు ఎప్పుడు వచ్చినా ఇదే రాగం. తమ్ముడు జవాబు చెప్పేవాడు కాదు. అది మధు సూదన్‌ను మరింత బాధించేది.

వాడు ఇంతకన్నా ఎంత తండ్లాడుతున్నాడో సుజాతకు తెల్సింది. కాలరీ ప్రాంతాల్లో సమ్మెలు, లాకౌట్లు, ధర్నాలు, ఊరేగింపులు, అరెస్టులు, కాల్పులు... ఈ వివరాలన్నీ కేవలం తమ్ముడి కోసమే సుజాత ఆలోచించి దడదడలాడేది. సుజాత అను కున్నంతా అయ్యింది. ఈ సమ్మెల వెనుక తన తమ్ముడు న్నాడని అరెస్టు చేయడం విడిచిపెట్టడం జరిగింది. గనుల మీద అంతకంతకు ఉద్రిక్తత నెలకొన్నది. అందులో భాగంగానే మధుసూదన్ లాంటి అధికార్ల పట్ల కార్మికులకు తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఘర్షణలు పెరుగుతూనే ఉన్నాయి. తాగుడు నిషేధించాలనే గొడవల్లో మధుసూదన్ బజారులో ఎవరితోనో నడిపి స్తున్న బ్రాందీషాపు మూతపడ్డది.

అనేక కారణాలతో మధుసూదన్ ఉగ్రుడై పోయాడు. తనకు వ్యతిరేకంగా మారిన పరిస్థితులన్ని టికి తన బావమరిదే కారణమన్నట్టుగా అతని ఉనికినే సహించేవాడు కాదు. తమ్ముడు అదేమి లెక్క చేసేవాడు కాదు. వారం వారం వచ్చి ఈ గొడవలు తనకేమి పట్ట నట్లు సుజాతను కలుస్తుండేవాడు. వాడి చిన్నారి మనసు ఈ ఎదురుదెబ్బల వలన ఎంత చెదిరిపోయిం దోనని సుజాత తమ్ముని ముఖంలోకి గుచ్చిగుచ్చి చూసేది. విచిత్రంగా తమ్ముని మాట, చేత పరమ ప్రశాంతంగా ఒక క్రమపద్ధతిలో ఉండేవి. బావమరిది కలిస్తే ఎంత గొడవ జరుగగలదోనని సుజాత ఆందోళన పడేది. బావ ప్రసక్తి లేకుండా మాట్లాడేది. బావ గురించి అన్ని తెలిసినవాడిలాగే ఉండేవాడు.

అట్లా తమ్ముని ద్వారా కొత్త ప్రపంచమేదో లీలగా తెలుస్తున్నట్లే ఉండేది. వారం వారం తనలో తానే సిగ్గు పడే విధంగా తమ్ముని కోసం ఎదురుచూసేది... వాడు క్రమక్రమంగా రక్తసంబంధంకన్నా ఎక్కువగా తోచే వాడు. తన భర్తతో పడుతున్న యాతన తనకు తెలియ కుండానే చెప్పుకునేది. తమ్ముడు వెళ్లిపోయిన తరువాత ఈ గొడవలన్నీ ఎందుకు చెప్పానా అనుకునేది. ఒక్కొక్క సారి అలాంటి వ్యతిరేకతలు గొడవలు తనకు కొత్తగా ఎందుకు స్ఫురిస్తున్నాయో తెలిసేదికాదు. తను ఎలాంటి స్నేహాల గురించి ఎలాంటి ఆత్మీయత గురించి ఎలాంటి మనుషుల గురించి తలపోస్తున్నదో అర్థమయ్యేది కాదు... వాడు లోకం గురించి, మను షుల గురించి అదోవిధమైన వెలుగు రాసిన గొంతుతో వివరించేవాడు. సిగ్గుపడుతున్నట్టుగా తెచ్చి పుస్తకాలు ఇచ్చేవాడు. స్వార్థం, తండ్లాట గలిగిన మనుషుల ప్రవర్తనకు మూలమెక్కడో ఆ పుస్తకాల్లో సుజాతకు అర్థమౌతుండేది.

తమ్ముడు పుట్టెడు దుఃఖంతో ఉన్నట్టు సుజాతకు ఒకమారన్పించింది. ఆ కన్నీళ్లు ఏ వేదనల నుండి ఊరి వచ్చాయో ఎంత విచారించినా తెలిసేది కాదు. అలాంటి తమ్ముణ్ని పోలీసులు అరెస్టు చేసి బయటకు రావడానికి వీలుకాని కేసులేవో పెట్టారు. వాణ్ని వరంగల్ సెంట్రల్ జైలుకు పంపారు....

'వాళ్లు బతుకరు. ఇంకొకరిని బతుకనియ్యరు,' మధుసూదన్ ఈమాటో ఇలాంటి మాటలో పదేపదే అంటుండేవాడు. ఒక్కొక్కమారు తీవ్రమైన కోపంతో మధుసూదన్‌కు జవాబు చెప్పాలనుకునేది. అప్పుడు తమ్ముడు కన్పించేవాడు. వాడు జీర్ణించుకున్న వేలాది మంది మంచి మనుషుల సంస్కారం ఆమెకు స్ఫురిం చేది. 'వీళ్లకు పై మనుషులే సరిగా కన్పించరు. లోపలి మనుషులు తెలుస్తారా? ఎవరి చుట్టూ వాళ్లే తిరిగితే మనిషికి లోకం తెలుస్తుందా?' అనుకునేది. ఇలాంటివో మరెలాంటివో అనేక మాటలు మనుషులతో పంచుకో వాలని ఉవ్విళ్లూరేది.

సుజాత చిత్రమైన ఘర్షణలో బతుకుతూ ఉండ గానే వాడు జైల్లో ఉన్న కాలంలోనే బయట అనూహ్య

మైన మార్పులు జరిగిపోయాయి. సుజాత వార్తాపత్రిక ఆధారంతో ఈ మార్పులను ఊహించడానికి అలవాటు పడ్డది. రామారావు ప్రభుత్వం తీవ్రవాదులపై విరుచుక పడ్డది. తాత్కాలికంగా తీవ్రవాదులు వెనుకంజ వేశారు. అప్పుడు కాలరీ ప్రాంతంలో తిరిగి బ్రాందీషాపులపై కార్మికులు దాడిచేశారు. అందులో మధుసూదన్ బ్రాందీషాపు ఒకటి. బ్రాందీషాపు ధ్వంసమైపోగానే ఎక్కడికక్కడ ఖాతాదార్లు మధుసూదన్‌కు మొండి చెయ్యి చూపించారు. ఆవిధంగా మధుసూదన్ నష్ట పోయిన దశలోనే గని మీద మధుసూదన్‌కు కార్మికు లతో ఘర్షణ ప్రారంభమయ్యింది. వీటన్నిటి మధ్య మధుసూదన్ తీవ్రమైన కోపంతో అందరిని వరసపెట్టి తిట్టేవాడు. సుజాతతో యుద్ధం చేసేవాడు.

'తమ్ముడు చెడిపోవడానికి నువ్వే కారణం,' అంటూ నిందించేవాడు. 'ఉల్ఫాగా తిరిగే ప్రతి లంపెన్ గాడు చేసే పనే అది. వాడు గూండ....,' ఇట్లా సాగేవి మధుసూదన్ తిట్లు.

సుజాత విలవిలలాడిపోయేది. తను తమ్ముణ్ని చెడగొట్టిందా? తమ్ముడి చేతల మంచి చెడ్డలేమిటో తనకు మళ్లీ మీమాంస ప్రారంభమయ్యేది. తిరిగి జవాబు చెప్పాలనే ఆలోచన ఎప్పుడు చేయలేదు. 'వాడు ఆత్మ గల మనిషి - ఆత్మ కలిగి ఉండడమే నేరం అంటున్నాడు భర్త.' మంచిచెడ్డలు రెండుగా చీలిపోయి నట్లుగా అన్పించేది. అయినా అప్పుడప్పుడూ. 'వాడు ఈ నిప్పులదారిని ఎందుకు ఎంచుకున్నాడో?' అను కునేది. తనకు తెలియకుండా తను ఆ దారిలో నడు స్తున్నట్లుగా తోచి ఉలిక్కిపడేది. తను జవాబు చెప్ప కున్నా భర్తతో కనిపించని నెత్తురేమి కారని తీవ్ర దీర్ఘ యుద్ధంలో కూరుకుపోయినట్లుగా ఒకనాడు అర్థమ య్యింది. అసలు భర్త జైల్లో ఉన్న తమ్ముడితో కాదు తనతో తలపడుతున్నాడని అర్థమై విస్తుపోయింది. తన సమస్త సాంసారిక జీవితాన్ని కుప్పపోసుకుని తనకు తెలియకుండానే సుజాత వెక్కివెక్కి ఏడ్చింది.

చివరకు సుజాతకు తేలిన అంశమేమిటంటే తమ్ముడు జైల్లో బందీ- అది ఎలాంటి బందికానో తనకు తెలియదు. తను ఈ ఇంట్లో బందీ. సమస్త మొగుడి అధికారాలతో తన శరీరంలోని ఆర్తిని ఎండగట్టాలని చూస్తున్నట్లుగా సుజాత అర్థం చేసుకున్నది. తమ్ముడు పదేపదే మానవజీవితంలోని ఇనికిపోయిన హింస గురించి, తనకు అర్థంకాని మరేమిటో గురించి చెప్పిన వన్నీ గుర్తుకొచ్చేవి. నాకన్నీ తెలుస్తున్నాయి చూడు అని చెప్పాలనిపించేది. తమ్ముని కోసం వేయికండ్లతో ఎదురుచూసేది.

ఒక్కొక్కమారు జైలుకు వెళ్లి తమ్ముణ్ని చూసి రావాలనుకునేది. ఆమాట తాను చెప్పకుండానే మధు సూదన్ అర్థం చేసుకున్నట్లుగా- "మరింక వాడితో మనకు ఎలాంటి బాంధవ్యాలు లేవు. ఆ బాంధవ్యాలు పెట్టుకుంటే నా గడప తొక్కవద్దు," అన్నాడు.

తన చేతకానితనం మీద ఎనలేని కోపంతో సుజాత ఏడ్వని రోజులేదు. ఒక్కొక్కమారు ఇంత బలహీ నమైన బంధం ఉంటేనేమి పోతేనేమీ అనే తెగింపు కలిగేది. పిల్లల ముఖాలు ఆమెను నిలవేసేవి. ఈ మొత్తంలో పిల్లల పెంపకం సవ్యంగా జరగడం లేదని తెలిసి మరీ భాధ వేసేది.

సుజాత లోలోపల జరుగుతున్న భీకర సంగ్రా మమే ఇంచుమించు బయట జరుగుతున్నట్లుగా సుజాతకు అర్థమయ్యింది. ఎక్కడో మండలాధ్యక్షున్ని చెరపట్టి చంపేయడం, తర్వాత ప్రభుత్వం దిగివచ్చి తీవ్ర వాదుల కోర్కెలు తీర్చడం- జైల్లో, లాకప్పుల్లో ఉన్న వాళ్లను విడుదల చేయడం- కూల్చివేసిన స్థూపాలను తిరిగి కట్టడం. తన సమస్యలు అడుగున పట్టేంత ఉద్విగ్నత సుజాతను ఊపేసింది. ఆ గొడవల్లో తమ్ముడు విడుదలై మందిలో కలిసిపోయాడు. తర్వాత ఎన్నికలు- ప్రభుత్వం మారిపోయింది.

బ్రహ్మాండమైన బహిరంగ సభలు, సమావేశాలు- వేల వేల ఎకరాల భూమి పంపకాలు- అలాంటి అల్ల కల్లోలాల మధ్య ఉవ్వెత్తున ఎగిసిపడే రైతుల పోరాట కెరటాల మధ్య ఆమె రోజూ వార్తాపత్రికలో తన తమ్ముణ్ని పోల్చుకోవడానికి వెతుకులాడేది. అదిగో అలాంటి ఉద్విగ్న రోజుల్లోనే తన తమ్ముని అరెస్టు వార్త సుజాతకు తెలిసింది. అప్పటికే విరుచుకుపడే కెరటా లకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం అరెస్టులు, కాల్చి వేతలు ముమ్మరం చేసింది.

మొదట ఆ వార్త చదివి సుజాత కుప్పకూలి పోయింది. ఆ తరువాత తనమీద తనకే చెప్పరాని ఆగ్రహం కలిగింది. ఈ ఇంట్లో పిడికెడు మెతుకులు, నాలుగు చీరల స్థానం పోతేపోయింది. పిల్లలు అడుక్కు తినైనా బతకగలరు. ఆలిశ్యం చేస్తే తమ్ముడు తనకు దక్కడు. ఎట్లాగైనా వాడిని రక్షించుకోవాలి. ఎవరి అండ తీసుకొనైనా వాన్ని విడిపించుకోవాలి. అలాంటి నిర్ణ యానికి వచ్చిన తరువాత తమ ఊళ్లోని మేనబావ గుర్తొ చ్చాడు. అప్పుడు అతను ఆ మండలానికి అధ్యక్షుడు. చిన్ననాడు సుజాతను అతనికే ఇచ్చి పెండ్లి చేద్దామను కున్నారు. సుజాత తల్లి చనిపోవడం మొదలుగా సుజాత కుటుంబం తరిగిపోయింది. వాళ్లు పెరిగిపోయారు. పెద్ద మేనత్త ఈ సంబంధం మీద అయిష్టత చూపింది. ఏది ఏమైనా అతన్ని కలుసుకోవాలని నిర్ణయానికి రాగానే సుజాత పిల్లలకు చెప్పి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నది.

ఆమె దుఃఖంతో, విచారంతో రైలు ఎక్కింది. రైల్లో వరుసక్రమంలోలేని ఆలోచన మధ్య ఇతర ప్రయాణీకు లెవరిని పట్టించుకోలేదు. కనీసం ఆ స్పృహ లేకుండా రైలు దిగింది.

ఎందుకోగాని ఉరుముడు, మెరుసుడేగాని వర్షం కురవడం లేదు. గాలి ఆపక్క ఈపక్క బొయ్యిమంటూ వీస్తోంది. మిణుగురుల్లా ఊరి దీపాలు కన్పిస్తున్నాయి. ఆ దారి, ఆ పరిసరాల స్పృహేలేదు. తను ఒంటరిగా నడుస్తున్నదన్న ధ్యాసే లేదు. ఆ దారంట అప్పుడప్పుడు సుజాతలాగే ప్రయాణించే వారి గురించి పట్టింపు లేదు. పెనుతుఫానులో అల్లకల్లోలమై పోతున్న సముద్రంలోని కెరటాల్లాగా ఆమె మనసులో అనేక జ్ఞాపకాలు. ఎక్కడో తెగి ఎక్కడో అతుక్కుంటున్న ఆ జ్ఞాపకాల సారాంశం మాత్రం అది.

సుజాత వడివడిగా నడుస్తోంది. ఇప్పుడు సుజాతకు ఊరు దగ్గరౌతున్నది. తన గుండె పెద్ద శబ్దం చేస్తూ కొట్టుకుంటున్నది. చీకటిరాత్రి. మేఘాలు గిరేసుకున్న ఆకాశం కింద ఎడతెగని శోకంలాగా చిమ్మట్ల రొద సాగుతూనే ఉన్నది. కాసేపు ఈ ఆలోచనలు కట్టిపెట్టి సుజాత నడవసాగింది. తుఫాను తర్వాత ప్రశాంతత ఆమె ముఖంలో లిప్తకాలం చోటు చేసుకున్నది. బలహీనమైన మెరుపు మెరిసింది. కొద్దిగా గాలి ఉధృతి తగ్గింది.

ఆ మెరుపు వెలుగులో చుట్టూ పరికించి చూసింది. కుడివేపు గుట్టబోరు కింద ఏనాడో చనిపోయిన ముస్లిం మతపెద్ద సమాధి (దర్గ) తెల్లగా కన్పించింది. దర్గ గుడికి ఆవలివేపున గల ఖాజిపల్లెలో ఏ అలికిడి లేదు. మళ్లీ తమ్ముడు మదిలో మెదిలాడు. తన చుట్టూ విస్తరించిన ధరిత్రి సొంతం వల్లకాడులా తోచింది. గాలికి వూగుతున్న చెట్లు వెంట్రుకలు విరబోసుకుని శివాలెత్తుతున్నట్టుగా తోచింది. ఎదురుగా బిజిగిరి. రెండు గుట్టల మధ్య 'బిజిగిరి' మెరుపు కనిపించి మాయమౌతోంది.

తమ్ముడి ఆలోచనలు పక్కకునెట్టి సుజాత రోడ్డుకు రెండు పక్కలా చూస్తూ నడుస్తోంది. రోడ్డుకు ఎడమపక్క విస్తరించిన అపారమైన నల్లరేగడి భూములు దున్నక పడావుపడి ఉన్నాయి. ఆ భూముల్లో అక్కడక్కడ రంగు వెలిసిన ఎర్ర జెండాలు రెపరెపలాడుతున్నాయి. ఈ భూములన్నీ తన మేనబావవే... రోడ్డుకు కుడివేపున ఉన్న భూముల్లో కొన్ని బిజిగిరి గ్రామస్తులవి. మరికొన్ని ఖాజిపల్లె తురకలవి. జులై చివరి రోజులు- కుడివైపు భూముల్లో మొక్కజొన్న, పత్తి పంటలు ఎందుచేతనో చాలా బలహీనంగా వున్నాయి.

తను వార్తాపత్రికల్లో చదివిన ఈ భూముల చరిత్ర అంతా సుజాతకు జ్ఞాపకం రాసాగింది. ఈ మట్టి, ఎందరి మనుషుల సుఖదుఃఖాలను చూసిందో? ఆ మట్టిమీద సుజాతకు చెప్పరాని ప్రేమేదో పొంగుకొచ్చింది. హఠాత్తుగా సుజాతకు ఆ జెండాల మధ్య తమ్ముని ముఖం కనిపించినట్టయింది. సుజాత పిచ్చిదానిలా నిలబడిపోయింది. ఈ సమస్త ప్రపంచం ప్రతిధ్వనించే విధంగా తమ్ముని పేరుపెట్టి పిలవాలని ఊహ మెదిలింది. ఆ పిలుపు ఆమె కంఠంలో అణిగిపోయి దాని స్థానంలో- చింపిరి తలలవాళ్లు చిరిగిన బట్టల అసంఖ్యాక జన సమూహం కోలాహలంగా ఎటో పోతున్నట్టుగా తోచింది...

'వాళ్లకీ బలం ఎక్కడి నుండి వచ్చింది? చిన్న దానికి చితకదానికి వాళ్లల్లో వాళ్లు కొట్లాడే మనుషులు ఒకే ఇంట్లో బతుకుతూ వేరు వేరు పాయలుగా చీలిపోయిన వాళ్లు- వాళ్లంతా ఎట్లా జమకూడారు? ఇది జరిగే పనేనా? వీళ్లందరి ఆయుంపట్లు తమ్మునికి దొరికినట్లుగానే ఉన్నది. వాడికి గట్టిగా ఒక దురుసు మాట మాట్లాడరాదు. ఇలాంటి మనుషులతో ఏం మాట్లాడాడు? వాళ్లల్లో వాడెట్లా ఇమిడిపోయాడు?' సుజాత తనలో తానే గొణుక్కుంటూ నడుస్తోంది.

సుజాత వెనుక నుంచి ఎడ్ల బండొకటి ఆ చీకట్లో బొకబొక లాడుతూ వస్తోంది. ఎవరో రావాల్సిన బంధువుల కోసం వచ్చిపోతున్నట్లున్నది. ఆ పెద్ద బండిలో నొగల కిందికి కాళ్లు జారిడిసి ఒక ముసలాయన మునిలాగ కూర్చుండి తోలుకపోతున్నాడు. ఆ ముసలాయనలో సుజాతకు తండ్రి జ్ఞాపకం వచ్చాడు. 'బతకచేతకాని పరమ దరిద్రులు' మధుసూదన్ తన తమ్మున్నుద్దేశించి చెప్పిన మాట ఎందుకో గుర్తొచ్చింది.

ఆరోజు సుజాతకు మనసు విలవిలలాడి పోయింది. 'నిజమే వానికి బతుక చేతకాదు. చేతనైనా మీలాంటి వాళ్లు బతికే తీరేమిటో కన్పిస్తనే ఉన్నది.' సుజాత జవాబు చెప్పాలనుకున్నది. కాని అనలేక పోయింది. బీరువాలో కుప్పలు కుప్పలుగా పడున్న కుదవబడిన నగలు ఆమెకు పాములు తేళ్లలాగా కన్పించాయి... భర్త అడ్డమైన లంచాలు, వడ్డీ వ్యాపారం, బీరు బ్రాందీ అమ్మకాలు- డబ్బు కక్కుర్తిలో భర్త ఎన్ని కుటుంబాలను ఆర్పివేస్తున్నది- ఎవరి పేరు మీద పగ సాధించడానికన్నట్టు బంగ్లా మీద బంగ్లా కడుతున్నది- డబ్బుతో సర్వ ప్రపంచాన్ని గెలవగలననే యావతో ఆయన మనుషులకు స్వయాన కన్నతల్లికి కూడ ఎట్లా దూరమైపోతున్నది. తనను గెలవాలని చేసే ప్రతి ప్రయత్నం తనకు అసహ్యాన్ని కలుగజేస్తున్నది. చివరికి అతని ఉనికి కొండచిలువ స్పర్శలాగ తనకు భరింపరానిదయ్యింది. తీవ్రమైన ఒంటరితనంతో ఆయనెట్లా

మానసిక వైద్యం చేయించుకున్నది. నిద్రరాక నిద్ర మాత్రలు మింగేది. అతని బతుకు సొంతం తనకన్నా మరెవరికి బాగా తెలుసు... తను అనుకున్నా అతనికి తన నిరసన అర్థమైతున్నట్టే ఉండేది.

ఉరుములు, మెరుపులు, గాలి దుమారం మధ్యనే సన్నగా వర్షం ప్రారంభమయ్యింది. గాలికి కరెంటు తీగలు హోరుమంటున్నాయి. తను నడుస్తున్న ధ్యాసే లేదు. సుజాతకు భర్త రూపం మారిపోయి తండ్రి గుర్తుకొచ్చాడు. మధుసూదన్‌కు తన తండ్రిపట్ల ఎందుకో తగని ద్వేషం. తండ్రి చనిపోయేదాక అతను తండ్రితో ఒక్కమాట మాట్లాడింది లేదు. మా ఇద్దరి పెంపకంలో తండ్రి అంశ ఉందని అతని అనుమానం కాబోలు. 'మీ తమ్ముడు అట్లా కావడానికి మీ నాయన చేతకానితనమే కారణం' అంటూ దెప్పిపొడిచేవాడు. భర్త అనే అర్థంలో తన తండ్రి తన భర్తలాగా బతకడం చేత కానివాడే. పెద తండ్రిలాగా ఉమ్మడి కుటుంబాన్ని మాయచేసి ఆస్తి వెనకేసుకోవడం తన తండ్రికి చేతకాక పోయింది. ఎకరాలకెకరాలు దున్ని, పుట్ల ధాన్యం పండించి కూడా తానేమి కూడబెట్టలేకపోయాడు. సుజాతకు నిలువెల్లా దుఃఖం ఆవరించింది. తండ్రి రూపం మసకమసకగా కన్పించింది. తన తల్లి చని పోయినప్పుడుగాని, వ్యవసాయం కుప్పకూలిపోతు న్నప్పుడుగాని ఆయన పడ్డ యాతన తనకు మాత్రమే తెలుసు.

ఊరు దగ్గరైంది. ఆ చీకట్లో ఊరు మొదట కూలిపోయి కూడా కర్మసాక్షిలాగా నిలుచున్న నైజాం కాలంనాటి బురుజు కన్పించింది. ఉగ్గబట్టుకున్న హృదయంతో అదిమి పెట్టుకున్న దుఃఖంతో ఆమె గ్రామంలోకి ప్రవేశించింది. గ్రామం కూడా తనలాగే దుఃఖాన్ని ఉగ్గబట్టుకున్నట్టే ఉన్నది. ఇండ్లల్లో మసక మసకగా దీపాలు వెలుగుతున్నాయి. సందడేమి లేదు. తోడేల్లు పడ్డ గొర్రె మందలాగా ఊరంతా బెగ్గం పాడై పోయినట్లుగానే ఉన్నది. ఊళ్లో ఎవరు తిరగడం లేదు. ఎక్కడో ఆవు దూడ కోసం హృదయవిదారకంగా అరు స్తోంది. సుజాతకు ఇద్దరో ముగ్గురో ముసలివాళ్లు ఎదురుపడ్డారు. వాళ్లు ఒంటిమీద గుడ్డలు కప్పు కోవడం వలన ఎవరైంది సుజాతకు తెలియలేదు. వాళ్లు ఏదో గొణిగారు. సుజాతకు ఆ మాటలేవీ అర్థంకాలేదు. సుజాత ఆ మాటలని, ఆ మనుషులెవరిని పట్టించుకో కుండా నడుస్తోంది.

ఈ వానలో ఈ రాత్రి ఎవరింటికని పోయేది? తను పుట్టి పెరిగిన ఆడుకున్న ఊరే- ఎట్లా తెగి పోయాయో గాని ఆ వూరితో తనకు తెలియకుండానే అన్ని బంధాలు ఏనాడో తెగిపోయాయి. తను తన తమ్మున్ని పోలీసుల నుండి విడిపించుకుందామని మేనబావను కలువడానికి బయలుదేరానని సుజాతకు జ్ఞాపకం వచ్చింది. 'వాన్ని ఈ జన్మకు చూస్తానో లేదో?' సుజాత ముద్దయిపోయిన గొంతుతో అనుకుంటూ వడి వడిగా మేనబావ ఇంటికేసి నడిచింది.

బయటి పాటకులు (పెద్ద దరువాజ తలుపులు) తోసుకొని లోపలికి అడుగుపెట్టింది. చుట్టూ విస్తరించి ఉన్న ప్రహరిగోడ లోపల విశాలమైన వాకిలి చివర బంగళా ఎక్కడికక్కడ కుప్పకూలిపోయి ఉంది. కూలిన గోడలతో ఆ లోగిలి వల్లకాడులా కన్పించింది. సుజాత ఆ దృశ్యాన్ని చూసి విస్తుపోయింది. మందీమార్బలంతో నిత్యం పెళ్లివారిల్లులాగ కళకళలాడే ఈ బంగళా ఇట్లా కుప్పకూలిందేమిటి? ఈ మార్పులేవీ సుజాత వార్త పత్రికలల్లో చదువలేదు.

ఎక్కడినుండో కుక్క అరుపు విన్పించింది. మరి కొద్దిసేపట్లో ఆ శిథిలాల మధ్య నుండి ఒక ముసలమ్మ 'కందీల' చేత్తో పట్టుకొని, "ఎవరూ?" అంటూ వాకిట్లోకి వచ్చింది... ఆ ముసలమ్మ గుడ్డిగా వెలిగే కందీల పైకెత్తి సుజాతను చూసి పోల్చుకోలేకపోయింది. సుజాత ఆ ముసలమ్మను పోల్చుకున్నది. ఆ ముసలమ్మే మేనత్త ఇంట్లో బాల్యం నుండి పనిచేస్తున్న దాసి లచ్చిమి. ఏటా వేలపుట్లు వడ్లు పండే రామప్ప చెరువు కింది గ్రామంలో నుండి లచ్చిమిని చిన్ననాడే తన మేనత్త నాలుగు కుంచాల వడ్లకు కొనుక్కొచ్చింది. తనకు తెలియదుగాని లచ్చిమి ఎన్నిసార్లో పారిపోయిందట. అయినా లచ్చిమికి దాసితనం తప్పలేదు. పెళ్లిపెటాకులు లేకుండా లచ్చిమి బతుకంతా మేనత్త కుటుంబంతోనే గడిచిపో యింది. సుజాతకు ఇలాంటివో మరెలాంటివో ఆలో చనలు సాగుతుండగా -

"ఎవరవ్వా! ఎవలు కావాలె," అని హీనమైన స్వరంతో కొద్దిగా భయం నిండిన గొంతుతో అడిగింది. సుజాతకు తనెందుకు వచ్చినట్టో గుర్తుకు రాలేదు. గొంతు పెగల్చుకొని తన తండ్రి పేరు చెప్పింది.

"సుజాతవ్వా నువ్వా! ఎవలో అనుకున్న," లాంతరు దింపింది.

"బావ కోసం వచ్చిన," సుజాత.

దాసి లచ్చిమి ఇందాకటి కంఠంలో ఏదో మార్పు వచ్చింది. "బావా?" చేతులు చిత్రంగా తిప్పింది. మళ్లీ ఏమనుకున్నదో ఏమో?

"ఇగో సుజాతవ్వా! ఈ బంగుళను బాంబులతో కూలగొట్టక ముందు నుంచే మీ బావ పిల్లలతో హన్మ కొండకు చేరుకున్నడు. మీరంతా ఏ రంధీ రవుసు

లేకుంట కాలేర్ల మీదికి పోయిండ్లు- ఈ వూల్లే ఎన్ని జరిగినయో నే జెప్పజాల. మీ బావ గొడ్డు గోదా భూమి జాగ గంగల కల్సినయ్. మీ బావ జాగ మీ బావ చూసు కున్నడు. నాకే ఏదారి కానరాక ఈ బంగుళల వుంటన్న," ముసలమ్మ గొంతు వనికింది. మరింక మాటలు రాక మూగపోయింది.

ఆ వర్షంలో సుజాత ఏమి తోచకుండా నిలు చున్నది. తన తమ్ముని మీద పెట్టుకున్న ఆశలన్నీ కుప్ప కూలిపోయాయి. మరింక ఎటుపోవాలి. కాళ్లు వణుకు తున్నాయి. లోలోపల దుఃఖం తెగుతోంది. పరుగెత్తు తున్నట్టుగా సుజాత అక్కడి నుండి బయటకు వచ్చి నిలుచున్నది.

"ఏం మనుషులో?" ముసలవ్వ గొణుగుతూ ఆ శిథిలాల మధ్యకు వెళ్లిపోయింది. నిలువెల్లా మైకం కమ్మిన మనిషిలాగ బజారులో నడవసాగింది. సమస్త జీవితాన్ని గడ్డిపోచలాగా వదిలిపోతున్న మనిషిలాగ నడు స్తోంది. దేన్ని ఖాతరు చేయకుండానే తను పుట్టి పెరిగిన ఇంటికి నడిచింది. ఆ ఇల్లు ఆ బంగ్లాలాగే ఎక్కడికక్కడ కూల్చివేయబడి ఉన్నది. ఆ ఇంటిని తన లేత చేతులతో అలికింది. ముగ్గులు వేసింది. ఆ ఇంటి ప్రతి మూలతో తను మాట్లాడింది. ఆ శిథిలాల మధ్య సుజాత పిచ్చి పట్టిన దానిలాగా తిరుగాడింది. ఈ ఇంటికి, ఇక్కడి జీవితానికి తనని దూరం చేసిందేమిటి?

మళ్లీమళ్లీ పదేపదే సుజాత చిక్కుదారుల్లోకి వెళ్లిపోతోంది. వాతావరణం మావురుగప్పినట్లుగా వున్నది. ఉరుములు మెరుపులు తగ్గాయి. ఏడ్చేడ్చి సొమ్మసిల్లినట్లుగా వర్షం తగ్గింది. తల్లి చనిపోతే తమ్ముణ్ని భుజానేసుకొని పాల కోసం తాను మాదిగ ఇండ్లల్లోకి పోయేది. తల్లి చనిపోయిన పిల్లవానికి తల్లి పాలకోసం అడగరానివాళ్లనల్ల అడిగాడు తండ్రి- చింత కింది రాజమ్మ ఆ మాదిగవాడలో తన తమ్మునికి రోజు పాలిచ్చేది. రాజమ్మకు కూడా తన తమ్ముని వయస్సంత కొడుకుండేవాడు. ఇద్దరు పిల్లలకు పాలు సరిపోవని తన తండ్రి రాజమ్మకు కొంత ధాన్యం పంపేవాడు. అర్ధ రాత్రి అపరాత్రి ఆ పసిగుడ్డు ఏడ్చేవాడు. వాన్ని భుజాన వేసుకుని మాదిగవాడకు పరుగెత్తేది. సుజాత తల్లి మనసుతో తడిసి ముద్దైపోయింది. వర్షంలో తడిసిన దానికన్నా ఈ భావనతో ఆమె నిలువెల్లా వణికిపో యింది. సుజాత ఈ ఒక్కరోజు ఈ భూప్రపంచంలో స్త్రీ ఎన్ని భావ ప్రకంపనాలకు లోనుకాగలదో అన్ని భావ ప్రకంపనాలకు లోనయ్యింది.

అప్రయత్నంగా లేచి నిలబడి సుజాత ఊరికి దక్షిణం వేపునే గల గుట్టబోరు కింది మాదిగవాడకేసి నడిచింది. తమ్ముని జాడ కోసం, వివరాల కోసం ఆమె మనసు పరితపిస్తోంది. ఎక్కడో రవ్వంత ఆశ కొట్టు మిట్టాడుతోంది. తప్పక తన తమ్ముడు తన హృదయాన్ని ఆ మాదిగవాడలో దాచి ఉంటాడని సుజాతకు గట్టి నమ్మకం కలిగింది. పాములవలె మెలికలు తిరుగుతూ వడివడిగా ప్రవహించే నీళ్ల ధారల్లోనుంచి, చితచితలాడే బురదలోంచి ఆమె నడుస్తోంది.

*

'ఆమె ఈరాత్రి ఎక్కడికి పోయినట్టు? ఈ వర్షాకాలపు రాత్రి ఎక్కడని వెతికేది?' మధుసూదన్ రైలు ప్లాట్‌ఫాం మీద నిలబడి చాలాసేపు కలియజూశాడు. రైలు దిగిన ప్రయాణీకులు తమ తమ పల్లెలను వెతు క్కుంటూ చేలకడ్డం పడిపోతున్నారు. రైలు కాసేపు ప్లాటుఫాం మీది నుండి కదలలేదు... మధుసూదన్ ప్రతి పెట్టే వెతికాడు. రైల్లోనివాళ్లు ఎవరిగొడవల్లో వాళ్లు న్నారు... స్టేషన్ బయట- ప్లాట్‌ఫాం మీద అంతటా వెతికాడు. కాని ఆ చీకట్లో సుజాత కన్పించలేదు.

మధుసూదన్‌కు ఒక్కసారిగా నిస్సత్తువ ఆవరిం చింది. తన సర్వశక్తులు ఎవరో లాగేసుకున్నట్లుగా ప్లాట్ ఫాం మీద ఒక సిమెంటు బెంచిమీద కూలబడి పోయాడు- కళ్లు మూసుకుంటే భయం గొలిపే చీకటి. ఎట్టకేలకు రైలు నీరసంగా ఖాజీపేట వైపు కదిలిపో యింది. అడుగుల చప్పుడు తగ్గిపోయింది. కళ్లు తెరిచి చూస్తే తన మెదడులాగే ప్లాట్‌ఫాం ఖాళీగా కన్పించింది.

'ఎటు వెళ్లాలి? ఏమి చేయాలి? వెనక్కి తిరిగి పోదామంటే గంటదాకా రైలు లేదు. ఏమో తనకు కన్పించకుండా ఆ మనిషి బిజిగిరికి వెళ్లిందేమో?' మధుసూదన్ స్టేషన్ బయటకు వచ్చి రాధమ్మ హోటల్లో చాయ్ తాగాడు. అక్కడున్న వాళ్లను అడుగుదామంటే గొంతు పెగలలేదు.

మట్టిరోడ్డు మీదికి వచ్చి కాసేపు నిలుచున్నాడు. ఆకాశంలోకి చూశాడు. ఆ ఉరుములు మెరుపులు తనకు తెలియని గందరగోళమేదో జరుగుతున్నట్లుగా ఉన్నది. విచిత్రం వాన వస్తుందో రాదో తెలియకుండా ఉన్నది. వాన వస్తే సాంతం తడిసిపోతే. అసలే ఈ వూళ్లు బాగుండలేదు... ఇంత రాత్రి ఎటుపోతున్నా వంటే- ఆ ఊళ్లో ఈ రాత్రి ఎట్లా గడిపేది? మధు సూదన్‌కు భయం నిలువెల్లా పాకింది. ఈ మనుషులు తనకెప్పుడు అర్థం కాలేదు.

మధుసూదన్‌కు బుసబుస కోపం పొంగింది. 'ఈ దరిద్రురాలు తననెందుకింత కష్టపెడుతోంది. ఈ గాలి దుమారంలో ఈ ఉరుముల మెరుపుల మధ్య నేను ఎక్కడని వెతికేది,' మనసులోనే తిట్టుకొని ఎటూ తేల్చు

కోలేక నిలుచున్నాడు. ఇంతలోనే బిజిగిరి వేపు నుండి బండి రావడం కన్పించింది.

"ఓ బండాయిన- నీకు తొవ్వల ఎవలన్న ఆడామె కన్పించిందా?" ఒక విధమైన విసుగుతో అడిగాడు.

బండాయన మాట్లాడలేదు. ఈ దరిద్రులందరికి పొగరే. ఏం కాలమచ్చింది? అనుకుంటూ రెండ డుగులేసి "విన్పిస్తలేదా? ఈ దారంట..." మధుసూదన్ మాట పూర్తి కాకముందే -

"మా ఇనత్తుంది. నువ్వా పిల్ల పెనిమిటివా?" బండాయన.

"సన్నగా ఉన్నామె. చేతులేమి లేకుంట పోతు న్నదా?" మధుసూదన్ ఆదుర్దాగా అడిగాడు.

"పోతంది పో," అన్నాడు బండాయన.

'అరె! తనకు కన్పించకుండా ఎపుడు రైలు దిగింది?' మధుసూదన్ మరో ఆలోచన లేకుండా ఆ మట్టిరోడ్డు మీద నడవసాగాడు. కాస్తంత దూరం పోయిన తరువాత ఇందాకటి ఆదుర్దా స్థానే సుజాతను ద్వేషించడానికి ఆసరా కోసం వెతుక్కోసాగిండు!

'ఇంతకూ తను చేసిన తప్పేమిటి?' ఈ ప్రశ్నను మధుసూదన్ తన సంసారం ఆరంభమయిన దగ్గరి నుండి అనేకమార్లు వేసుకున్నాడు. ఎప్పటికప్పుడు జవాబులు తనకు తానే చెప్పుకున్నాడు. మధుసూదన్ సంస్కారంలో 'తను' తప్ప ఇతరులు లేరు. అట్లా వుంటారనే విషయం కూడా అతను ఇంత పెనుగు లాటలో కూడా నమ్మలేకపోయాడు.

'నాలుగు పైసలు సంపాదించుకోవడం తప్పా? డబ్బులేనోడు డుబ్బుకు కొరగాడు. ఈ ప్రపంచం మీద మనిషి విలువ డబ్బుతో కొలువబడుతోంది. ఎట్లా సంపాయించావన్నది లెక్కకాదు. ఎంత సంపాయించా వన్నది లెక్క. సుజాతకేం తెలుసు? తన కడుపున పుట్టిన పిల్లలకేం తెలుసు? దరిద్రం ఎంత దుర్భరమైనదో? ఈ సంపాదనంతా ఎవరికోసం?' అతని అంతరంగంలో ఎక్కడో బలహీనమైన మూలుగుడు పెనుగులాడు తోంది.

'తనను లోకమంతా పైకి వచ్చిన మనిషని కీర్తి స్తోంది కాని... తన భార్య తన సమస్త సంపదను, శక్తిని కళ్ల కద్దుకోవాల్సిన భార్య ఒక్కమారు... ఒక్కమారు...' మధుసూదన్‌కు తన కాపురం తలుచుకోవడానికే భయ మేసింది.

'సుజాత తనకు ఎందుకు దూరమైపోతోందో? తను తాగడు. ఇతర దురలవాట్లేవి లేవు... తన భార్యకు తనకు ఎక్కడ తగువు ప్రారంభమయ్యింది?' మధు సూదన్‌కు ఒళ్లు జలదరించింది. ఇలాంటి ప్రశ్న మధు సూదన్‌కు మొలకెత్తడం ఇదే కొత్త.

అయినా ఆ ప్రశ్న అంతకంతకు పెద్దది కాసా గింది. 'ఎంత కాలమైంది? ఎక్కడ మొదలైంది? వెండి కొంటే సంతోషపడుతుందనుకున్నాడు. బంగారం కొంటే ఆమె కళ్లు మెరుస్తాయనుకున్నాడు. బంగళా కడితే ఆమె తృప్తి పడుతుందనుకున్నాడు. స్త్రీలు ఇలాంటి అవసరా లకు పొంగిపోవడం తనకు తెలుసు. కాని అవేమీ సుజాతను చేరనేలేదు. తన దగ్గరకు చేరవేయనేలేదు. అంతకంతకూ ఇద్దరి మధ్యా దూరం పెరిగిందే గాని తరుగలేదు. ఈ లోకం దేనికోసమై పడి చస్తుందో? ఈ లోకం దేన్నైతే బతికే విధానం అంటోందో అవేవి సుజాత గుర్తించలేదు... ఆమె తమ్ముణ్ని తెచ్చుకుందామంటే కాదంటినా? ఆమె అడుగాలె గాని ఏదైనా చేద్దును. కాని ఏది అడుగదే? వాడు బాగుపడితే అక్క సంతోషపడు తుందనుకుంటి. కాని వాడేమిటో తనకు ఎప్పుడు అర్థం కాలేదు. ఆ చూపులు, తనను సవాలు చేస్తుండేవి. వాడు నాలాగే మాటకు మాట అంటే తనకు అంత పెరుగకపోవును. కాని ఆ మవునం.... అదే తనను రెచ్చగొట్టేది.'

'దాన్ని తనెంత ప్రేమించాడు.' మధుసూదన్ కళ్లల్లో ఎందుకో బుసబుస కన్నీళ్లు పొంగాయి. ఇది చిత్రమైన పరిస్థితే. మధుసూదన్ ఈ మధ్యకాలంలో ఎప్పుడు ఏడ్వలేదు! ఏడ్వవల్సిన అవసరం కలుగలేదు. ఆ మట్టిరోడ్డులో ఏమి మహత్యమున్నదో? ఆ దారి ఎంత కన్నీటితో తడిసిందో?

'ఇన్నేండ్లు కష్టపడి ఇంత డబ్బు ఇంత ఆస్థి సంపా దించి తన పిల్లలు తన భార్య సుఖపడాలనే కదా! లోకు లందరికి దూరమైపోయింది. ఒక్క రూపాయి కూడ బెట్టడం కోసం బయట లోకులతో పెద్ద భీకర యుద్ధం, ఎంత కఠినంగా చేయాల్సి వచ్చేది సుజాతకు ఎట్లా తెలిసేది తెలిస్తే...

'ఒకవైపు తోడబుట్టిన అన్నలూ, అక్కా బాగు పడితేనే, మోసం చేస్తేనే సుజాత కుటుంబం చితికి పోయింది. తండ్రి వాళ్లతో కొట్లాడితే వీళ్లకీ గతి పట్టేదా? మాల మాదుగులతో కలిసి వాడు అట్లా తిరిగేవాడా? ఆ తండ్రి తన చాతకానితనం వల్ల కాదా వీళ్ల భవిష్యత్తు నాశనం చేసింది? ఈ కాలంలో పిల్లలు ఎంత హుషారు గా ఉంటున్నారు? అరె తను అన్ని రకాలుగా వాడికి మద్దతునిస్తి. ఏమి లేనివాండ్లు అట్లా పైకి పోతున్నరు? తను అలాంటి చేతకాని బావమరిదిని చేరదీసింది సుజాత కోసంకాదా? అట్లాగైనా ఒక్క మంచిమాట, పోనీ...' మధుసూదన్‌కు సుజాత రాతిగుండె గలదని పించింది. అసలు దానికి ప్రేమే లేదని అనుకున్నాడు. స్త్రీకి సంబంధించిన అతని పరిజ్ఞానం సుజాతను అంచనా కట్టడానికి సరిపోలేదు.

'తనకు నలభై సంవత్సరాలు దాటుతున్నాయి. సగంలో పడిపోయాడు. ఈ మొత్తం జీవితంలో తను బాగా అలిసిపోయాడు. ఇక్కడి నుండి వెనుతిరిగి చూసు కుంటే తనకు మిగిలిందెవరు? భార్య నా భార్య కాదు. పిల్లలు నా పిల్లలు కాదు...'

మధుసూదన్ అనేకమార్లు ఆత్మహత్య చేసుకో వాలనుకున్నాడు. ఆ పని చేయగలంత సాహసం, తెగింపు తనకి లేవనిపించాయి. బాగా తాగాలను కున్నాడు. కాని అప్పుడప్పుడు నిండా తాగినా కూడా అదీ తాత్కాలికమే అయ్యేది- తిరిగి పెద్ద బాధగానే మారేది. అనేకమార్లు సుజాత గొంతు నులిమి పారేయాలను కున్నాడు. ఆపని చేతకాలేదు. అన్ని రకాలుగా విఫలమై మానసిక వైద్యుని దగ్గరికి పరుగెత్తాడు.

అతగాడు భార్యను తీసుకురమ్మన్నాడు. తనకు ఆ వైద్యుని తన్నాలన్నంత కోపం వచ్చింది. తను సుజాత తో ఆ మాట చెప్పగలడా? చెప్పకుండా ఈ నరక యాతనలో ఎంతకాలమని బతకడం. 'ఇంతకూ తాను చేసిన నేరమేమిటి?' పదేపదే ఈ ప్రశ్న గింగురు మంటుండగా మధుసూదన్ నడుస్తున్నాడు. ఆరోజు డ్యూటీ నుంచి ఇంటికి రాగానే పిల్లలు చెప్పారు, 'అమ్మ మామయ్య కోసం పోయింద'ని. మధుసూదన్‌కు పరి ణామాలన్నీ అందరికంటే బాగా తెలుసు. మధుసూదన్ ఈ సంకుల సమరంలో ఇంటా బయటా తనోవేపు నిలబడే ఉన్నాడు.

తన డబ్బుకూ లావాదేవీలకూ, తన సమస్త భవిష్యత్తు పట్ల మధుసూదన్ జాగ్రత్తగానే ఉన్నాడు. వాటికి సంబంధించిన ప్రతిబంధకాల గురించి ప్రతీదీ తెలుసుకుంటూనే ఉన్నాడు. సరిహద్దు భద్రతాదళాల మోహరింపుతో మధుసూదన్ తనలాంటి వాళ్లందరిలాగే ఊపిరి పీల్చుకున్నాడు... ఎప్పటికైనా తనదే గెలుపు అను కున్నాడు. కాని చిత్రంగా తాను ఇంటా బయటా ఓడిపోతున్నట్లుగా ఆ క్షణంలో అన్పించింది. అణిగి పోతున్న దనుకున్నది ఎక్కడో రేగుతోంది.

తమ్ముని జాడ కోసం ఒంటరిగా తన భార్యే వెళ్లి పోయింది. కాసేపు తీవ్రమైన కోపంతో పెనుగులాడాడు. కాని తనకు ఇష్టం లేకపోయినా బయట లోకం ఒకటు న్నది. అప్పుడు మధుసూదన్ కోపం దిగిపోయింది. అట్లాగే బయలుదేరాడు. దొరికిన రైలు ఎక్కాడు. ఆ మట్టిరోడ్డు మీద నడుస్తున్నాడు. సన్నగా తుంపర మొద లయ్యింది. ఆ చిరాకులో తనెందుకోసం వస్తున్నదీ కొసా మొదలు మరిచిపోయిన వాడిలాగా ఊరి మొదటనే గల మర్రిచెట్టు కింద కాసేపు నిల్చున్నాడు... అక్కడ నిలువబుద్ధి కాలేదు.

ఊళ్లోకి నడిచాడేగాని తను ఎక్కడికి పోవాలో ఎవరిని అడుగాలో? ఏమని అడుగాలో ఏమి తోచ లేదు. అతనికి తెలియకుండానే అత్తగారింటివేపు నడిచాడు. అక్కడ కుప్పకూలిన్న ఇల్లు తప్ప సుజాత కన్పించలేదు. మధుసూదన్ పూర్తిగా తడిసిపోయాడు..... తనకు జరిగిందంతా భ్రమలాగే తోచింది. అతని మానసిక స్థితిమీద అనుమానం వేసింది. అసలు సుజాత ఇంట్లోనే ఉందేమో? మధుసూదన్ ఈ స్థితిలో ఉండగానే మాదిగవాడ నుండి ఊళ్లొకొచ్చిన ఒక యువకుడు మధుసూదన్ దగ్గరిదాకా వచ్చాడు. అతను మధుసూదన్‌ను గుర్తుపట్టాడు.

"సుజాతవ్వ మా ఇండ్లల్ల ఉన్నది," అన్నాడు.

మధుసూదన్‌కు ఏదీ అర్థం కాలేదు. కాళ్లీడిస్తూ ఆ బురదలో తాగినవానిలాగా ఆ ఇండ్లవైపు నడిచాడు. ఆ యువకుడు ఎందుకో వెనుతిరిగి మధుసూదన్ వెనుకనే దారి సూచిస్తూ నడవసాగిండు.

హరిజనవాడలో చాలామంది పోగై ఉన్నారు... చింతచెట్టు కింద అనేక గొంతులు ఏడుస్తున్నాయి... అలాంటి ఏడుపులు... మొత్తం మనిషిని చుట్టుముట్టే ఏడుపులు తనకు కొత్త- మధుసూదన్ లోలోపల ఏదో కల్లోలం రేగుతోంది. ఆ గొంతుల్లో సుజాత గొంతును మధుసూదన్ పోల్చుకున్నాడు.

మధుసూదన్ ఆ మంది ముందుకు చేరేసరికి ముసలి రాజమ్మ, సుజాత ఒకరినొకరు పెనవేసుకొని ఒకే రక్తం మనుషుల్లాగా ఏడుస్తున్నారు. మధు సూదన్‌ను చూసి కొందరు దూరం జరిగారు.

"అయ్యా మా కొడుకు దినాలకచ్చిండ్లావయ్యా!" రాజవ్వ వర్షిస్తూ పార్లి పార్లి ఏడుస్తోంది. మధుసూదన్‌కి అంతా అర్థమౌతూనే ఉన్నది. అతని పాదాలు భూమి లోనికీ, శిరస్సు నేలమీదికి వాలిపోతున్నట్లుగా ఉన్నది.

అక్కడ గుమిగూడిన స్త్రీలు ఏడుస్తున్నారు. కొందరు ఏదో గొణుగుతున్నరు. మరికొందరు తమ సమస్త దుఃఖాలకు కారణభూతమైన వాళ్లెవరినో ఆగ్రహావేశాలతో శపిస్తున్నారు, తిడుతున్నారు, ఒకరి నొకరు అందులోనే ఓదార్చుకుంటున్నరు.

భూమ్యాకాశాలను కలిపేస్తూ ఎడతెగని వర్షం - చుట్టూ కటిక చీకటి. దూరంగా ఎగువన మానేరు బ్రిడ్జి మీద నుంచి ధణధణలాడుతూ ఏదో రైలు ఉత్తరం వైపు వెళ్లిపోతోంది. సుజాత ఆ ముసలమ్మ మీద పడి అట్లాగే ఏడుస్తోంది. మధుసూదన్ ఒంటరిగా కలో, భ్రమో తెలియకుండా, జీవిత సాఫల్య వైఫల్యాల వివేచనా శక్తి నశించి నిలబడి ఉన్నాడు.

ఉరుములు, మెరుపులు ఎడతెగని వర్షంతో ఆరాత్రి అంత చప్పున తెల్లవారేట్టు లేదు.

సృజన మాసపత్రిక, జనవరి 1993